క్లుప్తంగా

పరీక్ష అట్టల పంపిణీ



విద్యార్థులకు అట్టలు అందించిన రోటరీ క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఉల్లంపర్రు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రావాడ సతీష్ మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాలకు విద్య, వైద్యంలో తమ వంతు సాయం అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సెక్రటరీ జవ్వాజి కళ్యాణ్, ట్రెజరర్ పోతాబత్తుల సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాదంపూడి రాజు, డి.స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

మావూరమ్మకు జలాభిషేకం



నీటి బిందెలతో ఊరేగుతున్న మహిళలు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బంగారువారి చెరువు గట్టున కొలువై ఉన్న మావూరమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం 108 బిందెలతో నీరుతెచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. తొలుత మహిళలు బిందెలతో, అమ్మవారి గరగలతో ఊరేగింపు నిర్వహించారు. రేపటి నుంచి జాతర ఉత్సవాలు ప్రారంభం కానున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్నేన రోజారమణి, మేడిది దానయ్య, శ్రీ లక్ష్మి, రాజరాజేశ్వరి, జక్కారావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్యూబాకు విరాళాల సేకరణ



విరాళాలు సేకరిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం

పెనుగొండ: క్యూబాకు సంఘీభావంగా పెనుగొండ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజల నుంచి గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కమిటీ సభ్యుడు షేక్ పాదుషా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధానాలకు సామ్రాజ్యవాదం దురహంకారం, కుట్రతో క్యూబా ప్రజలకు సహాయ సహకారాలు నిలిపివేయడంతో చిన్న పిల్లలు సైతం ఎంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆదినారాయణ. పూతినీడి పద్మలు పాల్గొన్నారు.

యూనిట్లు 136.. దరఖాస్తులు 900



అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తున్న బ్యాంకు మేనేజర్లు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ కార్పొరేషన్ల రుణాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 136 యూనిట్లకు 900 మంది దరఖాస్తులు చేసుకున్నట్టు మునిసిపల్ మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. బ్యాంకు మేనేజర్లు దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్టుచెప్పారు. కార్యక్రమంలో మేప్మా మేనేజర్ రత్నాకర్, సీవోలు, వెల్ఫేర్ సెక్రటరీలు, ఆర్పీలు పాల్గొన్నారు.

18న సర్వోదయ సమ్మేళన ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉంగుటూరు మండలం నాచుగుంటలోని సర్వోదయ స్థూపం వద్ద ఈనెల 18వ తేదిన 65వ సర్వోదయ సమ్మేళన ఆవిర్భావదినోత్సవం నిర్వహించనున్నట్టు సర్వోదయ మండలి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు చెప్పారు. ప్రజల్లో సమతాభావం, జాతీయ దృక్పథం పెంపొందించే లక్ష్యంగా 1961లో నాచుగుంటలో అఖిలభారతసర్వోదయ సమ్మేళనం జాతీయస్థాయిలో నిర్వహించారన్నారు. 18వ తేదిన నిర్వహించే కార్యక్రమంలో గాంధేయవాదులు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ప్రసాదరాజు పిలుపునిచ్చారు.

16న సర్వసభ్య సమావేశం

ఉండి: ఈ నెల 16వ తేదీ ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అధ్యక్షతన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎస్.రవీంద్ర తెలిపారు.

కలగా రహదారి నిర్మాణం

- పుంత రోడ్డును తలపిస్తున్న బాపూజీపురం – మార్టేరు రహదారి
- ప్రజా వినతులపై స్పందన కరువు



పెనుగొండ - మార్టేరు కాలువ గట్టు రహదారి



పెనుగొండ కాలువగట్టు నుంచి బాపూజీపురం రహదారి దుస్థితి

పెనుగొండ: పెనుగొండ – మార్టేరు కాలువ గట్టు రహదారి నిర్మాణం పరిసర ప్రాంతాల ప్రజలకు కలగా మిగిలింది. నర్సాపురం ప్రధాన కాలువ గట్టు బాపూజీపురం నుంచి మార్టేరు వరకు సుమారు మూడు కిలో మీటర్లకు పైగా రహదారి పుంత గట్టును తలపిస్తోంది. పెనుగొండలో పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకు, తిరిగి పెనుగొండ పెద్ద వంతెన నుంచి మార్టేరు వరకు రహదారి ఉంటుంది. ఇందులో పెద్ద వంతెన నుంచి బాపూజీపురం వరకు రహదారి నిర్మాణంపై ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో ఎన్నో సార్లు ప్రజలు వినతి పత్రాలను అధికారులు, ప్రజాప్రతినిధులకు అందజేశారు. అయినా, ఈ రోడ్డు నిర్మాణంపై స్పందన లేదు.

రాకపోకలకు అవస్థలు

పెద్ద వంతెన నుంచి మార్టేరు రహదారిలో కళాశాల శాంతి నగర్ వరకు సీసీ రోడ్డు నిర్మించారు. అక్కడ నుంచి మార్టేరు వరకు గత 15 ఏళ్ల క్రితం కంకర రోడ్డు నిర్మించారు. అయితే, నర్సాపురం ప్రధాన కాలువ ఆధునికీకరణతో రహదారి పూర్తిగా పాడైపోయి, కాలువ మట్టితో నిండి పోయింది. ఇది పుంత రహదారిగా మారింది. దీనిపై అప్పటి నుంచి రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి బాగున్నపుడు శాంతినగర్‌లో ఉన్న కళాశాలకు మార్టేరు పరిసర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు కాలవ గట్టు రహదారిపైనే రాకపోకలు సాగించేవారు. పుంతరోడ్డులా మారడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి సత్యవరం, నెగ్గిపూడి, వనంపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు పెనుగొండ రావడానికి దగ్గరగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రహదారి నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు నిర్మాణంపై ఆశలు

బాపూజీపురం ప్రజలు సైతం వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వాహనాలు రాకపోవడంతో కాలి నడక వంతెనపై మోసుకొంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతుల సాగు భూముల నుంచి పంటలు మిల్లులకు చేర్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఇటీవల డెప్యూటీ సీఎం పవన్ టీం నిర్వహించిన గ్రామ సభలో సైతం ఆయా ప్రాంతాల ప్రజలు రహదారి నిర్మాణానికి విన్నవించుకున్నారు. ఇటీవల సర్వే సైతం చేయడంతో రహదారి నిర్మాణంపై ఆశలు పెంచుకొన్నారు. త్వరగా నిధులు మంజూరు చేసి రహదారి నిర్మించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్యాస్ ధర తగ్గించాలంటూ ధర్నా

నరసాపురం రూరల్ : పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలంటూ మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు మాట్లాడుతూ ఒక్కసారిగా వంట గ్యాస్ ధరను రూ.50కు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యవసర సరుకుల ధరలతో ప్రజలు సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెంచిన గ్యాస్ ధర తగ్గించకపోతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కొపాడి కష్ణ, తిరుమాని మార్రాజు, ఏసుబాబు, తిరుమలశెట్టి లక్ష్మి, కొల్లాటి దుర్గ, తిరుమల శెట్టి నాగవేణి, కొల్లాటి అర్జునుడు, రాపాక సురేష్, గొడుగు నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి కంప్యూటర్ ఉచిత శిక్షణ



కరపత్రం విడుదల చేసిన ప్రిన్సిపాల్ అప్పారావు

పాలకొల్లు సెంట్రల్: సీనియర్ ఇంటర్ పాసైన విద్యార్థినులకు వివిధ కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి తెలిపారు. కోర్సుల కరపత్రాన్ని గురువారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోకొనట్ జూనియర్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా శోభారాణి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్లు 83092 08484, 83744 33919లో సంప్రదించాలని కోరారు.

15న ఆక్వా రైతాంగ సమావేశం

భీమవరం: అమెరికా సుంకాల కారణంగా తీవ్రంగా నష్టపోతున్న ఆక్వా రైతాంగం సమస్యలపై చర్చించడానికి ఈ నెల 15న భీమవరంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి జేఎన్వీ గోపాలన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా భారత దేశ ఉత్పత్తులపై దిగుమతి సుంకాన్ని 26 శాతం విధిస్తూ తీసుకున్న నిర్ణయం వలన ప్రధానంగా మన రాష్ట్రంలో ఆక్వా రైతాంగంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా సీడ్, ఫీడ్‌తో పాటు ఇతర ఆక్వా ఉత్పత్తి కారకాలు ధరలు పెరిగి రైతులు ఆందోళనలు చెందుతుంటే రొయ్యల ధర పతనం కావడంతో రైతాంగం తీవ్ర నష్టాలకు గురవుతున్నారన్నారు. ఆక్వా రంగ సమస్యలపై 15న నిర్వహించే సమావేశంలో ఆక్వా రైతులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

చాంబర్స్ కాలేజీలో బీసీఏ కోర్సు ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక చాంబర్స్ కళాశాలలో బీసీఏ (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సు ఏర్పాటుకు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) న్యూఢిల్లీ నుంచి అనుమతి లభించిందని ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. 2025 – 26 విద్యా సంవత్సరం నుంచి బీసీఏ కోర్సు ప్రారంభమవుతుందని, 60 సీట్లతో ఈ కోర్సుకు అనుమతి లభించిందని, 50 కంప్యూటర్స్‌తో అత్యాధునిక ల్యాబ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కోర్సు చేసిన వారికి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు, సెక్రటరీ కేవీ సీతారామరాజు, ఏబీఎస్ మూర్తి, ఎస్ సీతారామారావు, రేపాక ప్రవీణ్ భాను పాల్గొన్నారు.

పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరులో డీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లు ఆర్థిక సాయంతో రూ.19,300 విలువైన ఇన్వర్టర్‌ను అందజేశారు. స్కూల్ యాజమాన్య కమిటీ చైర్మన్ సుంకర పరమేశ్వరరావు మాట్లాడుతూ దాతలు అందించిన సౌకర్యాలను వినియోగించుకొని విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో రేపాక వెంకన్నబాబు, జి.నర్మద, ఎన్.దుర్గా వరప్రసాద్, ఏవీ శ్రీలక్ష్మి, డి.అనురాధ, కె.రాజేష్ కుమార్‌రాజు, జీఎస్ విజయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.ప్రేమరాజు, బి.రత్నకుమారి, డి.కనకరత్నం పాల్గొన్నారు.

బిడ్డకు ముర్రుపాలు టీకాతో సమానం



పాలకొల్లు సెంట్రల్ : పోషణ పక్షోత్సవాల్లో పాల్గొన్న సీడీపీఓ ఇందిర



యలమంచిలి : నేరేడుమిల్లిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ హసీనా

పాలకొల్లు సెంట్రల్: గర్భిణీ డెలివరీ అయిన వెంటనే గంటలోపు బిడ్డకు ముర్రుపాలు ఇవ్వాలని ఆ మురుపాలు బిడ్డకు టీకాలా పనిచేస్తుందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సీహెచ్ ఇందిర అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా వెయ్యి రోజులు సంరక్షణ కార్యక్రమం మండలంలోని శివదేవుని చిక్కాల గ్రామంలో నిర్వహించారు. బాలింత తన బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, ఏడో నెలలో అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు బిడ్డకు తల్లిపాలు కొనసాగించాలని ఇందిర సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎన్ మంగ, ఏఎన్ఎంలు పంచాయతీ సెక్రటరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాముఖ్యత తెలుసుకోవాలి

యలమంచిలి: బాలింతలు తల్లిపాలు ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. ఏడో పౌష్టికాహార పక్షోత్సవాన్ని గురువారం నేరేడుమిల్లి గ్రామంలో నిర్వహించారు. ఆహార విద్య, తల్లిపాలు ప్రాముఖ్యత, అనుబంధ పోషకాహార పద్ధతులను హసీనా వివరించారు. బిడ్డకు మొదటి ఆరు నెలలూ తప్పనిసరిగా తల్లిపాలు పట్టించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే అనుబంధ పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పెన్మత్స కృష్ణకుమారి, సీహెచ్ దుర్గ భవాని, పద్మ, రాజీ, వెంకటలక్ష్మి ఆరోగ్య సిబ్బంది విల్సన్, ప్రేమ కుమారి, ఆశ వర్కర్లు బి వరలక్ష్మి, టి.స్వరూపరాణి, కె.దుర్గ జ్యోతి, మహిళా పోలీసు శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రోగ నిరోధక శక్తి

పెనుగొండ: పౌష్టికాహారంలతో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డీవీఎస్ఆర్ స్వర్ణకుమారి అన్నారు. గురువారం కొడమంచిలి టి.మెరకలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టిక పక్వాడీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలింతలు బిడ్డకు పాలు ఇచ్చినపుడే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. పిల్లల ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం డి.పుష్పరాజ్యం, అంగన్‌వాడీ కార్యకర్త పి.బేబీ కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవలో ర్యాలీ

పెనుగొండ మండలం దేవలో పౌష్టికాహార పక్షోత్సవాలు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహార ఆవశ్యకతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రూతు కుమారి వివరించారు. అంగవాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం



యలమంచిలిలో విత్తనాలు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

యలమంచిలి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రకృతి వ్యవసాయ సేద్యం అవసరమని ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. యలమంచిలిలో గురువారం ఆయన రైతులకు నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రధానంగా భూసారం పెంచడానికి నవధాన్యాల సేద్యం ప్రముఖ పాత్ర వహిస్తుందని ఎంపీపీ వివరించారు. రైతులంతా ప్రకృతి వ్యవసాయం వైపు మరలాలని, కనీసం తాము సాగు చేసే భూమిలో 50 శాతమైన ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కో ఆర్డినేటర్ ఎం అరుణకుమారి మాట్లాడుతూ తీగ జాతి, పప్పు జాతికి చెందిన 15 రకాల విత్తనాల కిట్లను రైతులకు తక్కువ ధరకు అందజేస్తున్నట్టు చెప్పారు. 12 కిలోల కిట్లను రూ.850కు, 8 కిలోలు కిట్లను రూ.600కు అందిస్తున్నట్టు తెలిపారు. విత్తనాల కోసం రైతు సేవా కేంద్ర సహాయకులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జడ్డు లక్ష్మీనారాయణ (బదరీ), బండి లక్ష్మీదుర్గ, గంగులూరి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఒకే తేమ శాతం మెషీన్లను వాడాలి

పెనుగొండ: రైతు సేవా కేంద్రాలు, రైసు మిల్లుల్లో ఒకే తేమ శాతం మెషీన్లను వినియోగించాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆదేశించారు. గురువారం పెనుగొండ, ఆచంటల్లో రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, సేకరించిన ధాన్యాన్ని రైసుమిల్లులకు చేరవేతను ఆయన ప్రారంభించారు. తేమ శాతం తేడా రావడంతో నష్టపోతున్నామంటూ రైతులు చెప్పడంతో సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పెనుగొండలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామకృష్ణ, సర్పంచ్ నక్కాశ్యామలాసోనీ శాస్త్రి, బడేటి బ్రహ్మాజీ, వెలిచేటి బాబూరాజేంద్రప్రసాద్, కొండవీటి శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి పి.స్పందన, ఆచంటలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య, ప్రసాద్‌వ అధికారులు పాల్గొన్నారు.

యంత్ర పరికరాలు , విత్తనాలు అందజేత

పెనుమంట్ర: రైతు సేవా కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రైతులకు సూచించారు. గురువారం ఆలమూరులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీఓ దాసిరాజుతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో ఆయన మాట్లాడుతూ గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. 20 మంది రైతులకు సబ్సిడీపై యంత్ర పరికరాలు, పచ్చిరొట్ట విత్తనాలు అందజేశారు. కొయ్యేటిపాడులో రూ.10 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. పెనుమంట్ర డీసీ చైర్మన్ వెలగల బులిరామారెడ్డి, మాజీ జెడ్పీటీసీ నత్తి సాయి ఆదినారాయణరెడ్డి, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనుగొండలో ధాన్యం లారీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా హానిమన్ జయంతి



హానిమన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హోమియో వైద్యులు

నరసాపురం: హోమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ 270వ జయంతిని జిల్లా రిజిష్టర్డ్ హోమియో వైద్యుల సంఘం ఆధ్వర్యంలో గురువారం నరసాపురంలో ఘనంగా నిర్వహించారు. టేలర్ హైస్కూల్ సమీపంలో ఉన్న హానిమన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శిరిగినీడి రమేష్, రాజ్యలక్ష్మి దంపతులు మాట్లాడుతూ మానవాళికి తక్కువ ఖర్చుతో వైద్యం అందించే విధానాన్ని 200 సంవత్సరాలకు ముందే హానిమన్ కనిపెట్టారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా హోమియో వైద్యానికి గుర్తింపు ఉందని చెప్పారు. నరసాపురంలో దివంగత డాక్టర్ నాగభూషణం చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. సంఘ ప్రతినిధులు, హోమియో వైద్యులు సంఘ కార్యదర్శి పల్లా వెంకటేశ్వరరావు, సందీప్, ఎంఎస్ స్వామి, జాన్ హెన్రీ, శిరిగినీడి ఉమ, కేవీ చలపతిరావు, స్వర్ణలత, బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

- అధిక ధరలపై మద్యం ప్రియుల ఆగ్రహం
- ఆయా ప్రాంతాల్లో ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాల దర్శనం



పెనుమంట్ర డంపింగ్ యార్డులో ఉన్న మద్యంసీసాలు



లైసెన్సు షాపులో సిట్టింగ్ టేబుల్ వద్ద ఓ చిన్నారి

పెనుమంట్ర: మండలంలో మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీంతో మద్యం ఖాళీ బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలు డంపింగ్ యార్డులు, పంచాయతీ చెరువులు, కాల్వ రేవులు, ఆలయాలు, పాఠశాలలు, ఖాళీ ప్రదేశాల్లో దర్శనమిస్తున్నాయి. పెనుమంట్ర మండలంలో కొత్తగా వచ్చిన కల్లుగీత కార్మికుల కోటా షాపుతో సహా ఏడు లైసెన్సుడ్ షాపులు ఉన్నాయి. మొత్తం 18 గ్రామాల్లో సుమారు 70 నుంచి 80 వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఒకటి రెండు మినహా అన్ని రెస్టారెంట్‌లు, హోటళ్లు, చికెన్ సెంటర్ల వద్దా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పెంచిన మద్యం ధరకు మరో రూ.20 నుంచి రూ.50 వరకు అదనపు ధరకు విక్రయిస్తున్నారని మద్యం ప్రియులు వాపోతున్నారు. మండలంలోని అన్ని షాపుల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ప్రతి మద్యంషాపు వద్దా సిటింగ్ రూంలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు బెల్టు షాపులను అరికట్టి, గ్రామాల్లో కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

వెదురు గెడతో కొబ్బరి దింపు



అడవిపాలెంలో వెదురు గెడతో కొబ్బరికాయలు దింపుతున్న కార్మికుడు

యలమంచిలి: కొబ్బరిచెట్టు ఎక్కి దింపు తీయడం తెలిసిన విషయమే. వెదురు గెడతో కొబ్బరి దింపు పద్ధతిని పశ్చిమ డెల్టా రైతులకు పరిచయం చేస్తున్నారు దింపు కార్మికులు. 50 అడుగులకు పైబడి పెరిగిన కొబ్బరిచెట్టు అంటే ముచ్చెట్లు. ఈ చెట్టు విరిగిపోయే ప్రమాదం ఉండడంతో కాయలు తీసేందుకు దింపు కార్మికులు సంశయిస్తుంటారు. ఐతే 60, 70 అడుగుల పెరిగిన కొబ్బరిచెట్టయినాసరే వెదురు గెడకు కత్తి కట్టి కాయలను దింపుతున్నారు తూర్పు గోదావరి జిల్లా తుని పట్టణానికి చెందిన కొందరు కార్మికులు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న ఈ కార్మికులు మూడు వెదురు గెడలకు తీసుకుని వాటిని ఒకటిగా తాడుతో కట్టి చివరన కత్తి కట్టి గురువారం అడవిపాలెం పంచాయతీ కొబ్బరి చెట్ల కాయలను కిందకు దింపారు. ఇలా దించినందుకు ఒక కాయకు రూ.2 తీసుకుంటున్నారు. తీసిన కాయలను కూడా రాశి చేసి రైతులకు అప్పగించారు. దీంతో వెదురు గెడతో కొబ్బరి దింపు పద్ధతిని పశ్చిమ డెల్టా రైతులు స్వాగతం పలుకుతున్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ సభ్యురాలు దేవి

నరసాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంగిమాల దేవి అన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరంలోని జ్యోతిభా పూలే ఏపీ బాలికల సంక్షేమ గురుకుల పాఠశాల, ఎల్బీచర్ల బీఆర్ అంబేడ్కర్ ఏపీ బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, స్నాక్స్‌ని పరిశీలించారు. భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం పిల్లలకు అందించాలని సిబ్బందికి సూచించారు. వంట పాత్రలు, వంట చేసే ప్రదేశాన్ని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. హస్టళ్లకు సరఫరాదారు నాసిరకం సరుకులు సరఫరా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లక్ష్మణేశ్వరం బాలికల గురుకుల పాఠశాలలో ఆమె విద్యార్థులతో మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు శైలజ, నల్లి సాయిబాబా, సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.